క్లుప్తంగా

వ్యాయామ ఉపాధ్యాయులకు సత్కారం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు రాజరాజేశ్వరి

అమలాపురం టౌన్: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జరిగిన కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు తోట రవి చంద్రమౌళి, గోవిందరావు, పరమట విష్ణుప్రసాద్‌లను సత్కరించారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రాజరాజేశ్వరి బహుమతులు అందజేశారు. క్రీడా దినోత్సవం సందర్భంగా యల్లమిల్లి జయరామ్ పాఠశాలకు ఐదు బాస్కెట్ బాల్స్ బహూకరించారు.

జిల్లా సేపక్ తక్ర అసోసియేషన్ క్రీడా పోటీలు



జిల్లా సేపక్ తక్ర అసోసియేషన్ క్రీడా పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

అమలాపురం రూరల్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా సేపక్ తక్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బాలయోగి స్టేడియంలో గురువారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు జవ్వాది తాతబాబు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యమివ్వాలన్నారు. అనంతరం క్రీడాకారులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కేత సాయి, దుర్గాప్రసాద్, కోచ్ యండ్ర గౌతమ్, జిల్లా అసోసియేషన్ సభ్యులు జీవీ బాబు, వెంకటేశ్వరరావు, రమణ తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు.

ఫార్మసీ కళాశాలలో రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న విద్యార్థి

తాళ్లరేవు: కోరింగా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కాకినాడ లయన్స్‌క్లబ్, రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని కళాశాల కరస్పాండెంట్ ప్రగల్లపాటి కనకరాజు ప్రారంభించారు. రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధి దుర్గరాజు నేతృత్వంలో వైద్యులు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి రక్తాన్ని సేకరించారు. సుమారు 50 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ రక్తదానం చేయడమంటే ప్రాణదానంతో సమానమన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణజ్యోతి, ఏఓ కె.మాల తదితరులు పాల్గొన్నారు.

3న మండపేటలో జాబ్ మేళా

అమలాపురం రూరల్: జిల్లా ఉపాధి కార్యాలయం, స్కిల్ డెవలప్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో పని చేయుటకు వచ్చే నెల 3వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి మండపేట డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా జరగనుందని జిల్లా ఉపాధి అధికారి ఈ.వసంతలక్ష్మి తెలిపారు. ఈ కంపెనీల్లో రూ.12 వేల నుంచి రూ.16 వేల వరకూ జీతం ఇస్తారన్నారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్ చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాల కోసం 81218 38392 సెల్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ప్రతి మహిళను లక్షాధికారి చేయడమే లక్ష్యం



మహిళలకు బ్యాంకు రుణాల మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం రూరల్: మహిళలలో ఆర్థిక స్వావలంబన పెంపొందించి ప్రతి మహిళను లక్షాధికారిగా చేయడమే లక్ష్యంగా లక్‌పతి దీదీ కార్యక్రమం అమలు జరుగుతుందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. అమలాపురం మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం అమలాపురం నియోజకవర్గంలో 86 స్వయం సహాయక సంఘాలకు ఆగస్టు నెల రూ.11.86 కోట్ల బ్యాంకు రుణాలను ఎమ్మెల్యే ఆనందరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ నామన రాంబాబు, మెట్ల రమణబాబు, మల్లుల పోలయ్య, జయవెంకటలక్ష్మి, ఏపీఎం పీవీవీ రమణి తదితరులు పాల్గొన్నారు.



పోలీసుల నిఘా ఉంచాలి

రాత్రి వేళల్లో విధులు నిర్వర్తించే మహిళా డాక్టర్లు, నర్సులకు రక్షణగా నైట్ వాచ్‌మెన్‌లను అందుబాటులో ఉంచాలి. అంతేకాకుండా పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల వద్ద పోలీసులు నిఘా ఉంచాలి. తద్వారా మహిళా ఉద్యోగులకు భరోసాగా ఉంటుంది. ముఖ్యంగా సిబ్బందిని పూర్తి స్థాయిలో భర్తీ చేస్తే, వారి విధులను సక్రమంగా నిర్వర్తించడానికి అవకాశం ఉంటుంది. రోగులకు ప్రాణాలు పోసే వైద్యులపై దాడులు చేస్తే ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరించకూడదు.

– డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం, బెండమూర్లంక పీహెచ్‌సీ, అల్లవరం మండలం



తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది

కోల్‌కతా ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార ఘటన అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రజలకు వైద్యం అందించాలనే ఏకైక లక్ష్యంతో వైద్యరంగాన్ని ఎంచుకుని సేవలందిస్తున్న వైద్యులపై దాడులు దేశ వైద్యరంగాన్నే కుదిపేస్తున్నాయి. త్వరితగతిన విచారణ చేసి నిందితులకు కఠిన శిక్షను అమలు చేయాలి. మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టాల్లో మార్పులు తీసుకురావాలి.

– కేతా రఘుచంద్ర, పీజీ వైద్య విద్యార్థి, పుదుచ్చేరి వెంకటేశ్వర మెడికల్ కాలేజీ, యానాం



మద్యం మత్తే ముంచేస్తోంది

- జాతీయ రహదారి వెంబడి మద్యం షాపులు
- పలువురు మద్యం తాగి వాహనాలు నడపడంతో ప్రమాదాలు



యానాం జాతీయ రహదారిలో మద్యం షాపుల వద్ద మందుబాబుల హడావుడి



యానాం-అమలాపురం దారిలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు యువకులు (ఫైల్)

యానాం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భౌగోళికంగా అంతర్భాగంగా ఉన్న కేంద్రపాలిత ప్రాంతం యానాం-అమలాపురం 216 జాతీయ రహదారిలో ఇష్టానుసారంగా మద్యం షాపులు, బార్‌లు ఉండటంతో రోడ్డు ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయి. గతంలో సుప్రీం కోర్టు సైతం జాతీయ రహదారుల వెంబడి మద్యం షాపులు తొలగించాలని ఆదేశాలు ఇచ్చినా వాటిని అమలు చేయడం లేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ రహదారిలో ప్రమాదాల జోరు

కాకినాడ పట్టణం, అమలాపురం పట్టణానికి మధ్యలో 216 జాతీయ రహదారి పరిధిలో కేంద్ర పాలిత ప్రాంతం యానాం బైపాస్ రహదారి ఉంది. దీంతో ఈ బైపాస్ రహదారిని యానాం మద్యం వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. పట్టణం లోపల ఉండే పలు మద్యం షాపులను బైపాస్ రహదారిలోకి గతంలో తరలించి మద్యం వ్యాపారాలు ప్రారంభించారు. దీనికి తోడు బార్ అండ్ రెస్టారెంట్లు నెలకొల్పారు. దీంతో యానాం మీదుగా వెళ్లే వాహన చోదకులు, ప్రయాణికులు, యువకులు చవకగా దొరికే యానాం మద్యాన్ని తాగేందుకు ఆగుతుంటారు. ఉదయం 10 గంటల నుంచి మొదలు రాత్రి 12 గంటల వరకూ యానాం బైపాస్ రహదారి తిరునాళ్లను తలపిస్తుందంటే ఆశ్చర్యం లేదు. ప్రధానంగా సంక్రాంతి, దీపావళి, నూతన సంవత్సరం వంటి పండగ రోజుల్లోనైతే రోడ్డు దాటేందుకు ఇబ్బందులు పడేంతగా వాహనాలతో ట్రాఫిక్ రద్దీ ఉంటుంది.

యానాంలో ఇదీ పరిస్థితి

- గతేడాది యానాం బైపాస్ రహదారి నుంచి ఎదుర్లంక, మురమళ్ల, ముమ్మిడివరం తదితర ప్రాంతాల్లో మద్యం తాగి ప్రయాణిస్తున్న పలువురు మృతి చెందారు. పదుల సంఖ్యలో ఘటనలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడు కరవయ్యాడు.
- ఈ ఏడాది ఏప్రిల్ నెలలో పుట్టినరోజు వేడుకలకు యానాం వచ్చిన ముగ్గురు యువకులు పీకలదాకా తాగి ఆటోలో వెళుతూ ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టి మృతి చెందారు.
- అయితే యానాం జనాభా మాత్రం 55 వేలు మాత్రమే అయినా 7 హోల్‌సేల్ మద్యం షాపులు, 6 రిటైల్ మద్యం షాపులు ఉన్నాయి. ప్రస్తుతం యానాంకు నెలకు 9,100 కేసుల మద్యం దిగుమతి అవుతుంది. అందులో 4,450 కేసుల బీరు, 4,450 కేసుల బ్రాందీ ఉంటుంది. ఆ విధంగా 11 లారీల సరుకు చేరుకుంటుంది. ప్రధానంగా ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న మందుబాబుల వల్లే కొనుగోళ్లు ఆ స్థాయిలో ఉంటున్నాయన్నది బహిరంగ రహస్యమే.

మద్యం షాపులను ఎత్తివేయాలి



యానాంలో మద్యం ధరలు తక్కువగా ఉండటంతో యువకులు ఎక్కువగా బైపాస్ రహదారిలో ఉన్న బార్ అండ్ రెస్టారెంట్లు, మద్యం షాపుల వద్ద ఆగుతూ మద్యం తాగుతున్నారు. అనంతరం తిరిగి తమ వాహనాల్లో వెళ్లేటప్పుడు మద్యం మత్తులో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఒక్కోసారి మృత్యువాత పడుతూ అయినవారికి కడుపుకోత మిగులుస్తున్నారు. జాతీయ రహదారిలో ఉన్న మద్యం షాపులను ఎత్తివేయాలి.

– వడ్డి ఏడుకొండలు, విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు, యానాం

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఐ.పోలవరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్ పథకం ద్వారా రాయితీతో అందిస్తున్న సోలార్ రూఫ్‌టాప్‌లను ఇళ్లపై అమర్చుకుని విద్యుత్ బిల్లులు తగ్గించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కేశనకుర్రు పంచాయతీ పల్లిగూడెంలో సూర్యఘర్ పథకంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ పథకం ద్వారా కేంద్రం ఒక కిలోవాట్ సామర్థ్యం గల సోలార్ రూఫ్‌టాప్‌పై రూ.30 వేలు, రెండు కిలోవాట్ల సామర్థ్యం గల వాటిపై రూ.60 వేలు, మూడు కిలోవాట్ల కంటే ఎక్కువ సామర్థ్యమున్న రూఫ్‌టాప్‌లపై రూ.78వేల వరకు రాయితీ అందిస్తున్నారన్నారు. వీటి ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గృహానికి వినియోగించుకోగా మిగిలినది ప్రభుత్వమే వినియోగదారుల నుంచి కొనుగోలు చేస్తుందన్నారు. ఈ రూఫ్‌టాప్‌లు అమర్చుకోవడానికి బ్యాంకుల ద్వారా 90 శాతం రుణాలు అతి తక్కువ వడ్డీతో అందిస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ శివశంకరప్రసాద్, అమలాపురం ఆర్డీవో కేశవవర్ధన్‌రెడ్డి, డీపీఓ రాంబాబు, లీడ్ బ్యాంక్ మేనేజర్ వర్మ, తహసీల్దార్ విశ్వేశ్వరరావు, సర్పంచ్ వీరవెంకట సత్యకుమారి పాల్గొన్నారు.

సాధన ద్వారానే క్రీడా నైపుణ్యాలు మెరుగు



ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు



క్రీడా జ్యోతిని ప్రారంభిస్తున్న జిల్లా క్రీడాభారతి అధ్యక్షుడు శరత్‌బాబు తదితరులు

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

యానాం: క్రీడాకారులు నిత్యం సాధన ద్వారానే తమ క్రీడా నైపుణ్యాలను మెరుగుపర్చుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించగలరని ఆర్‌ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. స్థానిక బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో భారతీయ క్రీడా ప్రాధికారిక సంస్థ(శాయ్) ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువత క్రీడారంగాన్ని ఎంచుకోవడం ద్వారా స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగాలు సాధించే అవకాశం ఉంటుందన్నారు. అంతకుముందు జిల్లా స్థాయిలో నిర్వహించిన 5కే రెడ్ రన్‌లో పలువురు విద్యార్థులు, క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ డీడీ టి.రవి శంకర్, పీఈటీ పాము సత్యనారాయణ, కోచ్ ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సైకిలింగ్, వాకింగ్ ర్యాలీ

అమలాపురం రూరల్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కామనగరువు పరంజ్యోతి విద్యార్థులు సైకిలింగ్, వాకింగ్ ర్యాలీ గురువారం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ కార్ల్ డేవిడ్ కొమానపల్లి ఈ ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభారతి అధ్యక్షుడు అల్లాడ శరత్ బాబు, కోనసీమ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు పప్పుల శ్రీరామచంద్రమూర్తి క్రీడాభారతి జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల కృష్ణ క్రీడా జ్యోతిని ప్రారంభించారు. కార్యక్రమంలో జాషువా కొమానపల్లి, పీఈటీ వర్ధనపు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ నూకపేయి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వెల్లివిరిసిన దాతృత్వం

స్కూల్ భవనం నిర్మాణం



దాత నరసింహచైనులు నిర్మించిన పాఠశాల అదనపు భవనం

మామిడికుదురు: అమెరికాలో ఇంజినీర్‌గా స్థిరపడిన ఆదుర్రు గ్రామానికి చెందిన డాక్టర్ ఉపాధ్యాయుల లక్ష్మీనరసింహచైనులు, అన్నపూర్ణ దంపతులు దాతృత్వాన్ని చాటుకున్నారు. తమ స్వగ్రామం ఆదుర్రులో సొంత నిధులు రూ.26 లక్షల వ్యయంతో రెండు గదులతో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అదనపు భవనాన్ని నిర్మించారు. తాను విద్యనభ్యసించిన స్కూల్‌కు లక్ష్మీనరసింహచైనులు సొంత ఖర్చుతో భవనం నిర్మించారు. ఈ భవనం తాళాలను గురువారం సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ గెడ్డం మహలక్ష్మమ్మ, గ్రామ పెద్దల సమక్షంలో హెచ్‌ఎం యాళ్ల పళ్లంరాజుకు అప్పగించారు. దాత కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఎంపీపీ కుసుమ వనజకుమారి దాత కుటుంబ సభ్యులను అభినందించారు.

నేత్రదానంలో అపోహలు విడనాడాలి

అంబాజీపేట: నేత్రదానం చేయడంలో ఉన్న అపోహలను విడనాడి, ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయడాన్ని ఆదర్శంగా తీసుకోవాలని మండల ఆప్తాలమిక్ అధికారి వి.ప్రభాకర్ అన్నారు. ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు జరిగే జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని అంబాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గురువారం అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు పబ్బినీడి రాంబాబు, అంబాజీపేట ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు తపాలా శాఖ స్కాలర్‌షిప్

రామచంద్రపురం: తపాలా బిళ్లల సేకరణను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం దీన్ దయాళ్ స్పర్శ్ యోజన ప్రవేశపెట్టిందని, విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ కె శేషారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద తపాలా బిళ్లలను సేకరించే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను మంజూరు చేస్తారన్నారు. చదువులో మంచి ప్రతిభ కనబరచి, స్టాంపులు సేకరించే 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ ద్వారా నెలకు రూ 500 చొప్పున, ఏడాదికి రూ.6 వేలను అందిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థి కనీస అర్హత 60 శాతం మార్కుల ఉత్తీర్ణత ఉండాలని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 5 శాతం సడలింపు ఉంటుందని చెప్పారు. పాఠశాలలో ఫిలాటలీ క్లబ్ ఉండాలని, విద్యార్థులు అందులో సభ్యులై ఉండాలన్నారు. ఒకవేళ ఫిలాటలీ క్లబ్ లేకపోతే, విద్యార్థికి పోస్టాఫీసులో ఫిలాటలీ ఖాతా ఉండాలని తెలిపారు. విద్యార్థిరి సెప్టెంబర్ 30న రాత పరీక్ష ఉంటుందని, ఇందులో గెలుపొందిన విద్యార్థులు రెండో దశలో ఫిలాటలీ ప్రాజెక్టును సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తుల కోసం సమీపంలోని తపాలా కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. దరఖాస్తులను పోస్ట్‌మాస్టర్ జనరల్, విశాఖపట్నం రీజియన్, విశాఖపట్నం-530017 వారికి ఫిలాటలీ స్టాంపును జత చేసి, స్పీడ్ పోస్ట్ ద్వారా మాత్రమే సెప్టెంబర్ 16లోగా పంపించాలని తెలిపారు.

తెలుగు భాషకు వెలుగు ‘గిడుగు’



గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు



కొంకాపల్లి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల రూపక ప్రదర్శన

అమలాపురం టౌన్: వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు తెలుగు భాషకు వెలుగు రేఖ అని శ్రీశ్రీ కళా వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు అన్నారు. శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ, కోనసీమ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కూచిమంచి అగ్రహారంలో గురువారం జరిగిన భాషా పితామహుడు గిడుగు జయంతి, తెలుగు భాషా దినోత్సవ వేడుకలకు నానిరాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి మాకే బాలార్జున, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, కడలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రాజరాజేశ్వరి అధ్యక్షతన మాతృభాషా దినోత్సవం, గిడుగు రామమూర్తి పంతులు జయంతి సభ జరిగింది.

అలరించిన ‘తెలుగు తల్లి’ రూపకం

స్థానిక కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామమూర్తి జయంతి కార్యక్రమాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు వైభవాన్ని చాటుతూ విద్యార్థులు చేసిన రూపక ప్రదర్శన అందరినీ అలరించింది. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి చిత్రపటం వద్ద తెలుగు తేజ గీతాన్ని ఆలపించారు. తెలుగు ప్రధానాంశంగా సాగిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. తెలుగుపై విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ, తెలుగు పండితులు ప్రసాద్‌వర్మ, మట్టపర్తి శ్రీనివాసరావు చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



బ్రహ్మకుమారి స్వరూపను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ కుమారశాస్త్రి తదితరులు



ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవ సభలో మాట్లాడుతున్న అధ్యాపకులు



మెట్టకూరు హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

యానాం: వ్యవహారిక భాషోద్యమకారుడు గిడుగు రామమూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని గురువారం యానాంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ శాంతికుమార్ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని జరిపారు. తెలుగు తల్లి చిత్రపటానికి, గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా పేరుగాంచిన తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యా, ఉద్యోగ రంగాల్లో ఇంగ్లిష్ నేర్చుకోవడం తప్పుకాదని, అయితే వ్యవహారిక భాషను మరువకూడదన్నారు. కార్యక్రమంలో తెలుగు ఆచార్యుడు డాక్టర్ దుర్గయ్య అన్నందాసు తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలో మెట్టకూరు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవహారిక భాషోద్యమకారుడు గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పువ్వల రాజారామ్మోహన్, పీఈటీ శేరు విష్ణుమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాతృభాషను వారసత్వ సంపదగా అందించాలి

అమలాపురం రూరల్: మాతృభాష అమృతతుల్యమని, బాల్యం నుంచి పిల్లలకు మాతృభాషపై ఆసక్తిని, అభిరుచిని కలిగించే బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని బ్రహ్మకుమారి స్వరూప అన్నారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో వ్యవహారిక భాషోద్యమకర్త గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా గురువారం జరిగిన తెలుగు వైభవం సాహితీ సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కుమారశాస్త్రి మాట్లాడుతూ ఇతర భాషల్లో ప్రావీణ్యం పొందాలంటే మాతృ భాషను పరిపూర్ణంగా అభ్యసించాలని అన్నారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి మాట్లాడుతూ మాతృమూర్తి, మాతృభాష సర్వదా స్మరణీయాలని అన్నారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు పెమ్మరాజు గోపాల్, డాక్టర్ పద్మజ ప్రసంగించారు. అనంతరం ముఖ్య అతిథి స్వరూపను ఘనంగా సత్కరించారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

మామిడికుదురు: విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగరం ఎస్సై చైతన్యకుమార్ హెచ్చరించారు. మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన గురువారం యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు జరిగింది. విద్యా వ్యవస్థలో ర్యాగింగ్‌పై నిషేధం ఉందని ఎస్సై చెప్పారు. ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే వెంటనే సమాచారాన్ని అధ్యాపకులకు తెలపాలన్నారు. ర్యాగింగ్ వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాల వైపు యువత మళ్లకుండా, శ్రద్ధగా చదువుకోవాలని హితవు పలికారు. విద్యార్థినులతో గౌరవంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో సహాయ ప్రిన్సిపాల్ మోకా రంగారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ మృత్యుంజయరావు బాధ్యతల స్వీకరణ

మామిడికుదురు: కొత్త తహసీల్దార్‌గా మృత్యుంజయరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ శరణ్య, కార్యాలయ ఉద్యోగులు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే రెవెన్యూ పరమైన సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు.

పి.గన్నవరం: కొత్త తహసీల్దార్‌గా పి.శ్రీపల్లవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఇంతకు ముందు అయినవిల్లి తహసీల్దార్‌గా పనిచేశారు. ఆమెకు కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్‌ఏలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ప్రజారోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

అంబాజీపేట: మండలంలో ప్రజారోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు వైద్య సిబ్బందిని కోరారు. ఎంపీడీఓ జి.సరోవర్ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం హాలులో అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీల వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పంచాయతీల కార్యదర్శులతో అవగాహన సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఎంపీపీ దొమ్మేటి మాట్లాడుతూ ప్రస్తుతం వైరల్ ఫీవర్లు అధికంగా నమోదవుతున్నాయని, వారిని గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ ప్రతిరోజు చేపట్టాలని, దోమల నియంత్రణకు మందులను స్ప్రే చేయాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా ఆయా అంశాలపై చర్చించారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలకు వివరించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈఓపీఆర్డీ బి.మమత, పీహెచ్‌సీ వైద్యులు కేఎస్ శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.